తెలుగు కళాసమితి న్యూజెర్సీ - రాజాలక్ష్మి ఫౌండేషన్‌వారి కథల పోటీలో బహుమతి పొందిన కథ

# సారీ - అమ్మమ్మా!

— లపతి

తెల్లారే పక్కింటి ప్రసూనాంబగారు మోసుకొచ్చిన ముద్దుల మనవరాలి ముచ్చట్లు వినగానే శాంతమ్మగారి మనసంతా మలేరియా మందుమింగుడుపడనంత విషాదంగా మారిపోయింది.

ఆ పూటకి తన మనసులోని సంఘర్షణని మనసులోనే త్రొక్కిపట్టి అన్యమనస్కంగా అనాటి పని అయిందంటే- అయిందన్నట్టుగా పూర్తిచేసింది.

పాతికేళ్ళుగా తానొక తపస్సుగా పెంచి-పెద్దచేసిన తన కన్నులజ్యోతి, ఈరోజు తన ఆశయాలూ- ఆదర్శాలూ కూకటివేళ్ళతోసహా కూలిపోయే పనులు చేస్తోందంటే - ఏమాత్రమూ నమ్మలేకపోతోంది.

అయినా! ఆమె ప్రత్యక్షంగా చూసి మరీ చెప్పిన విషయాలను నమ్మకుండా వుండేదెట్లా? ఏది ఏమైనప్పటికీ తను రేపు హైదరాబాదువెళ్ళి, అసలు సంగతేమిటో ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవా లనే స్థిరనిశ్చయానికి వచ్చిన తర్వాతకానీ శాంతమ్మగారికి కునుకుపట్టిందికాదు.

చూస్తూండమని ఆయాల్లకూ, పనిపిల్లకూ అప్పగింతలుచెప్పి, మరునాటి ఉదయమే హైదరాబాదుకి బయలుదేరారు.

ఉత్తరం పత్తరం లేకుండా ఊడిపడిన అమ్మమ్మను చూడగానే ఆనందోద్వేగంతో ముద్దమందారంలా వికసించింది జ్యోతి వదనం.

గలగలా ఎగసిపడుతూన్న జలపాతంలా సంతోషతరంగాల మధ్య కిలకిల్లాడుతూ కబుర్లు చెప్తూన్న మనవరాలి ఉత్సాహాన్ని చూడగానే అప్పటిదాకా తన మనసులో చెలరేగుతూన్న ఆవేశపు జ్వాలలన్నీ అణగిపోయి, అనురాగపు అలలు ఎదలో ఎగసిపడగా, ముద్దిపెంగా ముద్దులు పెడుతూ హృదయానికి హత్తుకుంది శాంతమ్మగారు.

ఆరోజంతా మనవరాలికిష్టమైన వంటకాలు చేసిపెడుతూ కొత్త సంసారపు ముద్దూ-ముచ్చట్లతో తను వచ్చిన విషయమే మర్చిపోయి హాయిగా గడిపేసింది శాంతమ్మగారు.

మరునాడు మనవరాలివెంట తను కూడా నర్సింగ్‌హోమ్ చూడటానికి వస్తానంటూ బయల్దేరారు శాంతమ్మగారు.

'నర్సింగ్‌హోమ్‌లో ఓ గంట గడిపేసరికి ప్రసూనాంబగారు చెప్పిన చేదు నిజం ప్రత్యక్షంగా చూసి తరించిన శాంతమ్మగారి మనసు వేదనతో విలవిల్లాడిపోయింది.


తన మనసుని మెలిపెడుతూన్న ఆవేదనను జ్యోతికెలా తెలియజెప్పాలో నిర్ణయించుకోలేని సందిగ్ధంలో తనలో తనే మధనపడుతూ ఇంటికి చేరుకున్నారు శాంతమ్మగారు.

అమ్మమ్మ మనసులోని సంఘర్షణ ఎరుగని జ్యోతి భోజన సమయంలో తాము చేస్తున్న ఘనకార్యాలను మరింత గొప్పగా చెప్పసాగింది.

వేడినీటి బుగ్గలా తన మనసుని ఉడుకెత్తిస్తూన్న వ్యధను వెళ్ళగక్కే సమయమదికాదని తలచి; మింగుడుపడని భోజనంతోపాటు అప్రియమైన అభాషణలను కూడా గరళంలా గొంతులోనే నొక్కిపట్టి వుంచిన శాంతమ్మగారిలోని ఆవేదన, భోజనానంతరం లావాలా ఎగసిపడింది.

"జ్యోతులూ...!!నీవు..నీవేనా తల్లీ .. ఈ రోజిలా మాట్లాడుతున్నది. నువ్విలా మారడానికి కారణం నా పెంపకంలోని లోపమా! లేక, లేక నీలో నిగూఢంగా దాగిన నీ తండ్రి నెత్తుటి ప్రతాపమా!

నేడు నీవెంతో గొప్పగా భ్రమిస్తూన్న నీ ఘనతను నీ అమ్మమ్మగా నేను హర్షించలేకపోతున్నానురా జ్యోతులూ!



ఉద్యోగినుల సౌకర్యార్థం తను నిర్వహిస్తున్న 'బాల వికాస్' బాధ్యతను ప్రసూనాంబగారికి అప్పజెప్పి, తనులేని సమయంలో పిల్లల్ని మరింత జాగ్రత్తగా

పాతికేళ్ళక్రితం మలికాన్పుకి వస్తున్న మీ అమ్మతో, 'మళ్ళీ ఆడపిల్లే పుడితే అక్కడే పారేసిరా!' అని నిర్దాక్షిణ్యంగా మీ అమ్మను ఆజ్ఞాపించిన నీ తండ్రి పురుషాహంకారానికి – సమాధానంగా, ఈ ఒంటరి చేతులతో నిన్ను పెంచి, పెద్దచేసి, నారీలోకానికే వెన్నెల మేలిమి వజ్రంగా తీర్చిదిద్దిన ఈ అమ్మమ్మకు ఈనాడు 'ఓ గొ...ప్ప గైనకాలజిస్టుగా' నీ ఘనతనిలా చూపిస్తున్నావా తల్లీ!

'ఆడబ్రతుకులోని అబలత్వాన్ని రూపుమాపాలనే ఆదర్శానికీ ఆశయసాధనకూ అంకితమైన ఈ వృద్ధనారీ చైతన్యానికి – అసలు ఆడపుట్టుకే లేకుండా అంకురంగా నిర్మూలిస్తే మరింత సమస్యతో వుండబోవనే దౌర్భాగ్యపు దీన మాతల రాతిగుండెల రూకలతో ఆనకట్ట వేస్తున్నావా జ్యోతులూ!'

'అడుగడుగునా నీ చిన్నారి సంస్కారపు సుమసౌరభాలతో పరవశించిన ఈ తనువుకు, ఈనాటి నీ సురకత్తుల కోతలతో 'ప్రకృతి పిండాల' పరిణతివే విరోధిస్తూ పలాయన చిత్తపు సమాధిని కడుతున్నావా తల్లీ!

"ఇంత చదువూ చదివి ఇంగితజ్ఞానమే కోల్పోయిన 'నీ పాషాణపు ప్రగతి పథానికి నా జోహార్లు!!" అంటూ నిస్సత్తువగా నేలకొరిగిపోతూన్న అమ్మమ్మ ఆవేశంలోని ఆంతర్యం అర్థమయిన జ్యోతి, పశ్చాత్తాపంతో కుమిలిపోతూ అమ్మమ్మను పొదివిపట్టుకుని;

'ఇక ముందిలాంటి అమానుషమైన అతితెలివిపనులు చేయను అమ్మమ్మా!

'నన్ను క్షమించు అమ్మమ్మా! ప్లీజ్!

కాబోయే ప్రతి తల్లికీ ఆడపిల్లను ధైర్యంగా కని పెంచి పెద్ద చేయటానికవసరమైన ఆత్మవిశ్వాసమనే టానిక్కుని అందించి, నీ ఆదర్శానికి 'అమరజ్యోతి' నౌతాను."

'ప్లీజ్ అమ్మమ్మా! ఒక్కసారి నా అవివేకాన్ని మన్నించానని చెప్పవూ! ... అమ్మమ్మా --- ప్లీజ్!"

"ప్లీజ్ అమ్మమ్మా--! అయామ్ సారీ!!"

"సారీ --- అమ్మమ్మా ---!!!"

## గోడమీది కవిత్వం

మొక్క పెరిగేందుకు
కావాల్సింది — నీరు
ప్రగతి మొక్క తాగేది మాత్రం
గతి మాలిన వాళ్ళ కన్నీరు

— సీయస్సీ మురళి

## మొదటి రాత్రి

మన మనసులు కలసినవేళ అది
మమతల గాలులు వీచినవేళ అది
వలపుల జల్లులు కురిసినవేళ అది
అనురాగపు మల్లెలు పూచినవేళ అది
పరువము వాహిని పొంగి పొరలినవేళ అది
ఊహాగానము ఉరకలు తొక్కినవేళ అది
అలకలు విసుగులు అసలే లేనివేళ అది
నీ సొంపుల వంపులు తొలిసారిగా
నే కనులారా కాంచినవేళ అది
చిలిపి జాబిలి సిగ్గుతో మబ్బుచాటున
దాగినవేళ అది
అదీ ఇదీ కాని అయోమయములో
మనమున్న వేళ అది
మనమిద్దరమొకటై ఆనందపుటంచులు
చూసినవేళ అది
మరల మరల మరల మరల
తిరిగిరానివేళ అది
నీ జడలోని మల్లెల మత్తుకు
నే చిత్తయిపోయినవేళ అది
నీ అధరామృత మధురిమలో
నే వోలలాడినవేళ అది
అనుభవైక్యవేద్యమైనవేళ అది
భాషా భావాలకు అతీతమైనవేళ అది
అదే అదే మన మొదటిరాత్రివేళ అది

—ఎన్.ఎస్.ఎన్. మూర్తి
*Hyderabad, AP*

ఆవేశంగా ఓ కట్ట కవితల్ని సంచిలో పెట్టుకుని పత్రికాఫీసుకి వెళ్ళాడు. అవన్నీ సంపాదకుడికి టేబుల్ మీద పడేశాడు. ఆయన వాటి వంక చూడకుండానే "ఏ విషయం మీద రాశారో



చెప్పండి ముందు!" అడిగాడు.

"నా కవిత్వంలో జ్వాలలు ఎక్కువగా వున్నాయి" అన్నాడు కవి ఆవేశంగా.

"కవిత్వంలో జ్వాలలు కాదు. జ్వాల్లో మీ కవిత్వం పెడితే బాగుంటుంది!" అన్నాడు సంపాదకుడు తాపీగా — ఓ కవిత చదివిన తర్వాత.

## తుమ్మెదనై పాడనా?

మల్లెపూవులాంటి నవ్వు మరోసారి ఏదీ?
మురిపించకు. చెలీ! నన్ను. మరువలేను మరీ మరీ.

పరువాలే పరిమళాలు పారిజాత సుమదళాలు
పలకరించు నీ సొగసులు వలపుల విరితోరణాలు
నిలువెల్లా సోయగాలు పిలిచే సిరివెన్నెలలు
చిరునవ్వులు నాపాటను పలికించే కిన్నెరలు. /మల్లె/

కొనగోటికి తెలుసునులే ఎదవీణల రాగాలు
ఎలతేటిని పిలుచునులే విరిజాణల భావాలు
కొనగోరై మీటనా కోటిరాగమాలికలు
తుమ్మెదనై పాడనా కమ్మని తొలి కోరికలు /మల్లె/

— దూసి ధర్మారావు
*Sringavarapukota, AP*

## అనుభవం (?)

ఉండాలి శ్రీవారి / శ్రీమతి అనుగ్రహం
శుభానికి చుక్కెదురు ఆగ్రహం!
రానీకు ఎడబాటనే శనిగ్రహం
చేసుకో నీ ఇల్లు, రతీమన్మథ నివాసగృహం!

(వివరణ: శారీరకంగా ఎడబాటేకాదు, మానసికంగా చిన్న–చిన్న కలతలవల్లకూడా ఎడబాటు తప్పదు. అందుకు toll సంసారజీవితమా??) ధ్యేయం)

— బేతనపల్లి బోస్
*Fairlawn, NJ*

## అపరాధిని

అపరాధిని నపరాధి నపరాధినీ నన్ను
కరుణించి క్షమియించు కరుణానిధీ.... /అపరాధి/

వరదుడవై నీ దరిజేర రమ్మంటె
బురదలో పొరలుచు దరిజేరకుంటి.... /అపరాధి/

పరులను నునువలె ప్రేమించమంటె
పరులను అరులని ద్వేషించుచుంటి.... /అపరాధి/

దాచిన సొమ్మంతా దోచి యిమ్మంటె
దాచుచుంటిని పైగా దోచుచునుంటి.... /అపరాధి/

శత్రువు లార్వుర చేరదీయకుమంటె
'దాసోహమ'ని వారికి దాసుడనౌచుంటి.... /అపరాధి/

'దేహమె నేన'నే మోహము విడమంటె
దేహసౌఖ్యములకె దేవులాడుచుంటి.... /అపరాధి/

ఏనాటి పుణ్యమో ఈనాడు నిసుగంటి
ఏనాటి పాపమో నీమాట వినకుంటి.... /అపరాధి/

— మంత్రవాది శ్రీరామమూర్తి
*Edison, NJ*